# * పిరికితనం *

శ్రీ పన్యాల రంగనాధరావు

"ఆడది, తనంతట తనేవచ్చి, మోహం పట్టలేక పురుషుణ్ణి కోరితే, పురుషుడు గారు నిగ్రహించుకోగలడంటావా, లేక, లేడంటావా?" అన్నాడు రామేశం.

"ఏం వెధవ ప్రశ్న" అనుకున్నాడు కామేశం.

"ఊరుకున్నావేం?" అన్నాడు రామేశం.

"నిగ్రహించుకోలేడనే అంటాను" అన్నాడు కామేశం.

"నిగ్రహించుకోగలడనే అంటాను" అన్నాడు రామేశం.

"ఎందుకొచ్చిన వాదన?" అనుకుంటూనే, "ఎట్లా?" అన్నాడు కామేశం.

"ఒకప్పుడు నా దగ్గరకో అమ్మాయి—బంధువుల పిల్లేనూ—వచ్చి, హటాత్తుగా నా చేతులు పట్టుకుంది. మొదట నేను చాలా ఆశ్చర్యపడ్డాను. రమ్మని సంజ్ఞ చేసింది. ఆ పిల్ల అనాకారి కూడా కాదు. వెంట పడదామా అనిపించింది కూడాను. ఇంతలో ఏం పోయిందని కూడా అనుకున్నాను. ఆమె నా చేతులు పట్టుకున్నప్పుడు చప్పున నా దేహం ఝుల్లుమన్నది. అయినా నాకు వెళ్ళబుద్ధి పుట్టలేదు. నువు నమ్మితావో నమ్మవోకాని, నిజంగా, వొట్టు. నేనా పిల్లతో పోలేదు. దీన్నేమంటావు?" అన్నాడు రామేశం.

"చాతకాని వాడగట్టు!" అనుకున్నాడు కామేశం.

"చెప్పరా, దీన్ని —"

"ఓయ్ పిచ్చికుంకా! అది నిగ్రహమని మిడిసిపడుతున్నట్టున్నావుగాని, నువు బయటపెట్టింది నీ దౌర్బల్యం. తెలిసిందా?" అన్నాడు కామేశం.

"దౌర్బల్యం కాదు, నిగ్రహమనే అంటాను. ఎందాకంటావా? అంటే, నా బుద్ధి తక్కువ అనుకున్నాడు కామేశం! ఆ క్షణంలో నన్ను ఎటువంటి ఉద్రేకమూ ఆవేశించలేదు. నీ ఖర్మం, అనుకున్నాడు కామేశం; ఉద్రేకం-కట్టలు తెగే ఉద్రేకం-కలగటానికూడా కొన్ని సమయాసమయాలంటూ ఉంటై తెలుసా? ఏడిశావు, అనుకున్నాడు కామేశం! అదీ కాక, వాతావరణానిక్కూడా, ఉద్రేకాలు లోబడి వుంటై. ఆ పిల్ల మొగుడు కూడా, ఆ ఇంట్లోనే ఉంటున్నాడు." అన్నాడు రామేశం.

"నీ బొంద!" అనుకొని, "ఏమవుతేనేం? నువ్వు పిరికివాడివి, చాతకాని దద్దమ్మవి అయినప్పుడు?" అన్నాడు కామేశం.

.... .... ....

"నేను కలకత్తాలో ఉన్నప్పుడు చిన్న గమ్మత్తు జరిగింది." అన్నాడు కామేశం.

"చెప్పు చెప్పు" అన్నాడు రామేశం.

"నేనూ మన గోపిగాడూ కలిసి ఒక భోగం దానింటికి వెళ్ళాం" అన్నాడు కామేశం.

"ఇకనేం?" అన్నాడు రామేశం.

"గోపీ గాడికి, వాళ్ళు అదివరకే పరిచయస్తులట.

ఒక నలభై యేళ్ళపాటి మనిషి, ఇద్దరు ఇరవై, ఇరవై అయిదేళ్ళపాటి అమ్మాయిలూ ఉన్నారు. తల్లీ కూతుళ్ళంటాడు గోపి. ఆ యిద్దరిలోనూ పెద్దది గోపీగాణ్ణి రెక్క పుచ్చుకొని లాక్కుపోతూ ఉంటే నేను బిత్తరపోయినాను. ఆ రెండోది నా చెయ్యి పట్టుకొని లాగింది. నాకు అంతా కొత్త. భాష కూడా రాదు. నా కెందుకో దడ పట్టుకుంది. ఫరవాలేదు వెళ్ళరా. నేనంతా ఏర్పాటు చేశాన్లే అంటాడు. గోపీ నవ్వుతూ, ఆ మాటలతో, నా దేహం మీద తేళ్లూ, జెర్రులూ పాకినై. ఆ పిల్ల నన్ను గదిలోకి లాక్కుపోయింది. ఏమంటుందో గొడవ, వెనకపాటున వచ్చి నన్ను కావలించుకుంది. నా వీపుకి రెండు బలమైన ముళ్లు గుచ్చుకున్నట్టయి. అసహ్యమేసి, దూరంగా నెట్టాను. నా చెయ్యిమళ్ళీ పట్టుకుంది. నా కెందుకురా ఈ సొద అంటె, గోపీగాడు వినికూడా తన మానాన వెళ్ళిపోయినాడు" అన్నాడు కామేశం.

"అయితే నువేం చేసినట్టు? అన్నాడు రామేశం.

ఏమిటి చెయ్యడం? అది అక్కడ నుంచి పోతే బాగుండునని, సిగరెట్టు కావాలంటూ సంజ్ఞ చేశాను. ఆ పిల్ల బయటకు పోవటమే వ్యవధిగా తలుపులు బిగించి పడుకున్నాను. ఎండలో తిరిగి అలసి ఉన్నానేమో, నాకు చప్పున నిద్రపట్టింది. తిరిగి సాయంకాలం అయిదింటికి మెళకువొచ్చింది. లేచి చూద్దునూ, ఆ పిల్ల నా పక్కనే పడుకొనిఉంది. నన్ను చూస్తూ, నవ్వుతూ. నాకు భయమేసింది. చెదిరి ఉన్న పంచె కప్పుకొని, నా దేహమంతా తడిమి చూసుకొని తృప్తి పడ్డాను. నువ్వు నమ్ముతావో నమ్మవో గాని, ఆ పిల్లతో నేననుభవించనే లేదు" అన్నాడు కామేశం.

"అయితే నువ్వు ప్రకటించింది నిగ్రహమే నేమిటి? అన్నాడు రామేశం.

కామేశం తుళ్ళి పడ్డాడు.

"ఒరే భాయీ! నీకు తెలియనిఆడది నీ చెయ్యి పట్టి లాగుతూ నిన్ను కోరితే నీకు చప్పున ఉద్రేకం కలగదనే విషయం తెలిసిందా? అయితే నువు చెప్పిన నీ అనుభవంలో నీకు ఉద్రేకం కలక్కపోవటానికి అవకాశాలు లేవు. నిన్నెట్లా నమ్మాలో తెలీకుండా ఉంది. నమ్మమంటున్నావు గనక, నీ నిగ్రహాన్ని నమ్ముతూ, నువ్వు ప్రకటించింది నీ పిరికితనమే అని నిశ్చయంగా చెపుతాను." అన్నాడు రామేశం.

"అబ్బ! ఏం పొక్క ఏం చెమట" అనుకున్నాడు కామేశం.

"నీతో మాట్లాడం నాదే బుద్ధితక్కువ" అనుకున్నాడు కామేశం. ★